AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
13-10-2025 (Monday) MAIN EDITION

## ఫ్లాట్‌గా లిస్టయిన టాటా క్యాపిటల్ కంపెనీ షేర్లు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** టాటా గ్రూప్‌నకు చెందిన బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ అయిన టాటా క్యాపిటల్ షేర్లు సోమవారం లిస్టయ్యాయి. లిస్టింగ్ గెయిన్స్ ఆశించిన ఇన్వెస్టర్లకు ఈ కంపెనీ నిరాశను మిగిల్చింది. ఐపీవో ప్రైస్ రూ. 326 కాగా.. రూ. 330 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ నుంచి రూ. 15,511 కోట్లు సమీకరించడం కోసం టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో 21 కోట్ల తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ. 6,846 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 10 ముఖ విలువ కలిగిన 26.58 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా మరో 8,665.87 కోట్లను సమీకరించింది.

## రాజకీయాల్లో డబ్బులు రావట్లేదు..: కేంద్ర మంత్రి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి తన మంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. మలయాళ సినీ నటుడిగా పేరుపొందిన ఆయన, రాజకీయ జీవితంలోకి వచ్చిన తర్వాత తన ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందని వెల్లడించారు. కేరళలోని కన్నూర్‌లో జరిగిన బీజేపీ సమావేశంలో సురేష్ గోపి మాట్లాడుతూ.. “నేను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆదాయం పూర్తిగా ఆగిపోయింది. ప్రజా సేవ చేయాలన్న అంకితభావం ఉన్నా, ఆర్థికంగా స్థిరంగా ఉండడం అవసరం. నాకు సినిమాలు అంటే ప్రాణం. నా జీవనాధారం. తిరిగి సినిమాల్లోకి రావాలని అనుకుంటున్నాను” అని తెలిపారు.

## కరూర్ ఘటనపై సీబీఐ విచారణ..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడులోని కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు సీబీఐ విచారణకు సోమవారం ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ జడ్జి పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. తొక్కిసలాట కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే.

## 'కంచ గచ్చిబౌలి భూములు మావే..'



**అక్షరటుడే, హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇక్కడ 400 ఎకరాలను ప్రభుత్వం విక్రయించాలని చూడగా.. కోర్టులు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఆ భూములు తమవే అంటూ నిజాం వారసులు ప్రెస్ మీట్ పెట్టారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ సైతం వేశామన్నారు.

## ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రకటించింది. ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారాన్ని అందించింది. జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లకు ఆర్థిక శాస్త్రంలో నోబెల్ ప్రైజ్ ఇస్తున్నట్లు వెల్లడించింది.

## చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మృతి



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ నేత, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (84) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయిన లక్ష్మారెడ్డి కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్నారు. ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని హైదర్‌గూడ అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం 5:30 గంటలకు తుది శ్వాస విడిచారు. కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు.

## కలెక్టరేట్‌లో కామాంధుడు..




**అక్షరటుడే, హన్మకొండ:** కలెక్టరేట్ లోనే మహిళలకు రక్షణ కరువైంది. ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులకు భద్రత లేకుండా పోయింది. హన్మకొండ కలెక్టరేట్‌లో మహిళా సిబ్బందిపై ఓ అధికారి అత్యాచార యత్నం చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కలెక్టరేట్‌లో ఇర్ఫాన్ సోహైల్ అనే వ్యక్తి సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆయన ఇటీవల తోటి ఉద్యోగిపై అత్యాచార యత్నం చేశాడు. నిందితుడి నుంచి తప్పించుకున్న బాధితురాలు సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిపై లైంగిక వేధింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో సోహెల్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

## ఆర్జేడీకి ఎదురుదెబ్బ..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ ఎన్నికల ముందు ఆర్జేడీకి ఎదురుదెబ్బ తగిలింది. ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసులో పార్టీ అధినేత లాలూప్రసాద్‌తో పాటు ఆయన భార్య రబ్రీదేవి, తేజస్వి యాదవ్‌పై రౌస్ అవెన్యూ కోర్టు అభియోగాలు మోపింది. లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ సందర్భంగా సోమవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అవినీతి, నేరపూరిత కుట్ర, మోసం అభియోగాలు మోపింది. అలాగే తేజస్వి యాదవ్, రబ్రీ దేవిపై కూడా నేరాలు మోపబడ్డాయి.

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు గెజిట్ నోటిఫికేషన్ జారీ కావడంతో ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. తమదైన వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలకు సవాల్ విసురుతున్నాయి. ఎన్నికలో గెలవడం ద్వారా తమ బలం పెంచుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా.. బీజేపీ నేడో రేపో ఎంపిక చేయనుంది. క్షేత్రస్థాయిలో ప్రచారం కోసం ఇప్పటికే ఇన్‌ఛార్జీలను రంగంలోకి దింపాయి.**

**– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




# జూబ్లీహిల్స్ పోరుకు సై..

- ప్రధాన పార్టీల్లో సమరోత్సాహం
- ఉప ఎన్నికకు విడుదలైన నోటిఫికేషన్
- నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూడు పార్టీలు
- ప్రచారంతో హోరెత్తిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- ఇంకా అభ్యర్థిని ఖరారు చేయని బీజేపీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైంది. షేక్‌పేట తహశీల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ నెల 21 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. కాగా.. ఈ నెల 15న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్ దాఖలు చేయనుండగా, అదే రోజు లేదా తర్వాతి రోజు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కూడా నామినేషన్ వేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, బీజేపీ అభ్యర్థి ఇంకా ఖరారు కాలేదు. నేడో, రేపో బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించే అవకాశముంది.

### సిట్టింగ్ స్థానంపై బీఆర్ఎస్ గురి

జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. సిట్టింగ్ సీటును కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా దూసుకెళ్తోంది. ఈ ఉప ఎన్నిక ద్వారా పార్టీ బలంగా ఉందన్న సంకేతాన్ని ఇచ్చేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే సోమవారం రహ మత్ నగర్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా కేటీఆర్, హరీశ్‌రావు, పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. మరోవైపు, ఇప్పటికే డివిజన్ల వారీగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించింది.

### కాంగ్రెస్ పార్టీకి సవాలే..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీకి అసలైన సవాలుగా మారింది. ఈ ఎన్నిక ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టనుంది. జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయడం ద్వారా తమ పాలనకు ప్రజామోదం ఉందన్న ప్రచారం చేసుకోవచ్చని కాంగ్రెస్ యోచిస్తోంది. అందుకోసమే సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఉప ఎన్నికలో విజయం సాధించి మరింత పట్టు పెంచుకోవాలని భావిస్తోంది.

### తేలని బీజేపీ అభ్యర్థి

రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించిన బీజేపీ.. ఉప ఎన్నికలో గెలుపొందడం ద్వారా తమ సత్తా నిరూపించుకోవాలని భావిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు గెలుపొందిన జోష్‌లో ఉన్న కాషాయ పార్టీ.. జూబ్లీహిల్స్‌పై గురి పెట్టింది. అయితే అభ్యర్థిని ఇంకా ఖరారు చేయని బీజేపీ నాయకత్వం.. బలమైన నేతను రంగంలోకి దింపాలని యోచిస్తోంది. అభ్యర్థిని ప్రకటించగానే రంగంలోకి దిగేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

## జూబ్లీహిల్స్‌లో కారుకు, బుల్డోజర్‌కు మధ్య పోటీ: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ పరిధిలోని రహమత్ నగర్‌లో సోమవారం బీఆర్ఎస్ సభలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు పక్కా అన్నారు. మెజారిటీ ఎంత అన్నదే లేలాలన్నారు. ఉప ఎన్నికలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని చెప్పారు. ప్రజలు రేవంత్ రెడ్డిని తిడుతున్నారని ఎద్దేవా చేశారు. తమను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలకు అవకాశం వచ్చిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే హైడ్రా బుల్డోజర్లు ఇళ్లను కూల్చడానికి లైసెన్స్ ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూల్చడమేనా అని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో పేదలను రోడ్ల మీదకు తెచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ వాళ్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదు చేశారన్నారు. రాష్ట్రమంతటా ప్రజలు జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబితే హామీలు అమలు అవుతాయన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం నెల రోజులు కష్టపడాలని ఆయన కోరారు.

## గాజా యుద్ధం ముగిసింది..: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇజ్రాయిల్ - హమాస్ మధ్య యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో ఇజ్రాయెల్‌కు వెళ్లే మార్గంలో ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అనేక యుద్ధాలను ఆపానని, పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ మధ్య నెలకొన్న సంఘర్షణను కూడా నిలువరిస్తానని చెప్పుకొచ్చారు. భారత్, పాక్ మధ్య సైనిక ఘర్షణను సుంకాలను ఉపయోగించి పరిష్కరించానని పునరుద్ఘాటించారు. భారీ సుంకాల గురించి రెండు దేశాలను హెచ్చరించడంతో 24 గంటల్లోనే వివాదం పరిష్కృతమైందన్నారు. గాజా శాంతి ప్రణాళికతో అందరూ సంతోషంగా ఉంటారని చెప్పారు.

## క్రికెట్ మైదానంలో కుప్పకూలిన బౌలర్



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** క్రికెట్ మైదానంలో హోరాహోరీగా సాగుతున్న ఆట ఒక్కసారిగా విషాదం నింపింది. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో బౌలర్ అహ్మర్ ఖాన్ గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించాడు. బిలారి చక్కెర మిల్లు మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొరాదాబాద్ - సంభాల్ జట్లు తలపడ్డాయి. మొరాదాబాద్ బౌలర్ అహ్మర్ ఖాన్ చివరి ఓవర్ వేసి మ్యాచ్‌ను గెలిపించాడు. ఈ క్రమంలో ఆఖరి బంతి వేసిన త్వరాత పిచ్‌పై కూర్చొని, ఊపిరాడక తల్లడిల్లాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా వైద్యులు అతను అప్పటికే గుండెపోటుతో మరణించాడని తెలిపారు.

## ఎయిర్‌పోర్టుపై అధ్యయనానికి నిధులు




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రాంతీయ విమాన సర్వీసుల అనుసంధానం కోసం సర్కారు చర్యలు తీసుకుంటోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం (రామగుండం) వద్ద మరో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. ఇక్కడ ప్రతిపాదిత విమానాశ్రయం నిర్మాణం సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు రూ.40.53 లక్షల నిధులు మంజూరు చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే ఆదిలాబాద్‌తో పాటు వరంగల్‌లో మమ్నూరు విమానాశ్రయాల నిర్మాణ ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

## సంచులు తీసుకొని పోయినోళ్లకు ఎంట్రీ లేదు..



**అక్షరటుడే, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారికి తమ పార్టీలోకి ఎంట్రీ లేదన్నారు. పార్టీని మోసం చేసి, సంచులు తీసుకొని పోయినోళ్లకు మళ్లీ ఎంట్రీ లేదన్నారు. ఎర్ర శేఖర్ కాంగ్రెస్‌లో చేరడానికి వీలులేదని అనిరుధ్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ క్లారిటీతో ఉన్నారన్నారు. ఆయనను పార్టీలోకి చేర్చుకునే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వార్తలు రాయించుకొని చిల్లర రాజకీయాలు చేయొద్దంటూ వ్యాఖ్యానించారు.

## శ్రీకాళహస్తి ఆలయ దర్శన వేళల్లో మార్పులు



**అక్షరటుడే, శ్రీకాళహస్తి :** కార్తీక మాసం నేపథ్యంలో ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల 20 వరకు దర్శన వేళల్లో మార్పులు అమల్లోకి రానున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి వెల్లడించారు. భక్తుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు సర్వదర్శనానికి అనుమతి ఉంటుంది. రాహు, కేతు పూజలు ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

## ఒక్క హిట్‌తో అంతా ఈ అమ్మడి జపమే..



**ఇండస్ట్రీలో ఎవరి టైమ్ ఎప్పుడు ఎలా టర్న్ అవుతుందో చెప్పడం చాలా కష్టం. రోజుల్లో కెరీర్ మలుపు తీసుకుంటుంది. అందుకు ఉదాహరణగా నిలుస్తున్నారు మలయాళ బ్యూటీ మమిత బైజు. ఒకప్పుడు చిన్న సినిమాల్లో సైడ్ క్యారెక్టర్లు చేసిన ఈమె, ఇప్పుడు దక్షిణాది ఇండస్ట్రీల్లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది. మలయాళంలో 10కి పైగా సినిమాల్లో నటించినా పెద్దగా గుర్తింపు రాకపోయిన మమితకు, 'ప్రేమలు' అనే ఒక్క చిత్రం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. ఈ సినిమా పెద్ద హిట్ కావడంతో, మమితకు ఒక్కసారిగా అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం తమిళంలో మమిత బైజు డేట్స్‌కు డిమాండ్ తారాస్థాయిలో ఉంది.**

**– అక్షరటుడే, సినిమాడెస్క్**